

**ఆపన్న హస్తం**

టీడీపీ మూకల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. - 8లో



**విష్ణు ఆలయాన్ని సందర్శించిన..**

వాకాడు మండలం,తిరుమూరు గ్రామంలో బయల్పడిన విష్ణు ఆలయాన్ని పురావస్తుశాఖ అధికారులు పరిశీలించారు. - 8లో



**సిమెంట్ లారీ బోల్తా**

సిమెంట్ లారీ బోల్తా పడిన ఘటన రాపూరు మండలం, పెంచలకోన తెగచర్ల మార్గంలోని మలుపు వద్ద చోటుచేసుకుంది. - 8లో



తోసుకుంటూ రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

# జనరల్ నరకం!

● మనరూల్ షేక్. హౌరాకు చెందిన వ్యక్తి. పొట్టచేతబట్టుకుని బెంగళూరుకు చేరుకుని అక్కడే కూలిపనులు చేస్తున్నాడు. ఏదైనా అత్యవసరం అయితేనో, పండుగకో హౌరాకు వెళ్లి వారం రోజులు గడిపి తిరిగి బెంగళూరు చేరుకునేవాడు. అందులో భాగంగా మంగళవారం బెంగళూరు నుంచి హౌరాకు బయల్దేరాడు. స్లీపర్, ఏసీ క్లాస్ టికెట్ తీసుకునే స్థోమత లేక.. జనరల్ టికెట్ కొనుక్కుని హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. బెంగళూరు చేరుకునే సరికే హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు జనంతో కిక్కిరిసిపోయింది. అతి కష్టం మీద రైలు ఎక్కాడు. తర్వాత కూర్చునేందుకు కాదు కదా, నిల్చొనేందుకు్కూడా చోటు దొరక్కపోవడంతో ఒక కాలుపైనే తిరుపతి వరకు కాలు మార్చిమార్చి నిల్చొని ప్రయాణించాడు. నిల్చోవడం కష్టంగా ఉండడంతో రైల్లో బాత్‌రూం పక్కన స్థలం ఉంటే అక్కడ కొంత సమయం కూర్చున్నారు. అక్కడ దుర్వాసన తట్టుకోలేక మరలా దూరంగా వచ్చి ఒంటి కాలుపైనే నిల్చొని ప్రయాణించాడు.

● బెంగళూరుకు చెందిన రామకృష్ణగౌడ్ తిరుమల శ్రీవారి దర్శనం కోసం మంగళవారం హౌరా ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతికి చేరుకున్నా రు. జనరల్ టికెట్ తీసుకున్న ఆయన బోగీలోకి చేరుకునే సరికి నిల్చోవడానిక్కూడా స్థలం దొరకలేదు. ఏం చేయాలో అర్థం కాలేదు. జనరల్ బోగీలో సామాన్లు పెట్టుకునేందుకు ఏర్పాటు చేసిన లగేజీ క్యారియర్‌పైనా ప్రయాణికులు ఇరుక్కుని కూర్చొని ఉండడం కనిపించింది. చేసేది లేక.. తన బ్యాగ్‌లోని తువాలు (టవల్)ని అటు, ఇటు వైపు లగేజీ క్యారియర్‌కి ముడివేసి ఊయలలా ఏర్పాటు చేసుకుని కూర్చొన్నాడు. ఎక్కడ ఊడి పోతుందోననే భయంతో ప్రాణాలు పిడికిట్లో పెట్టుకుని తిరుపతికి చేరుకున్నాడు.

.. ఇది మనరూల్ షేక్, రామకృష్ణ గౌడ్ పరిస్థితే కాదు.. హౌరా ఎక్స్‌ప్రెస్ రైల్లో నిత్యం ఇదే తంతు. కిక్కిరిసిన బోగీలో ఒకరిపై ఒకరు కూర్చొని, నిల్చొని ప్రయాణించడం సర్వసాధారణం. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి నగరం మీదుగా ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నా.. అందుకు తగ్గట్టుగా జనరల్ బోగీల సంఖ్య లేకపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. తిరుమల, శ్రీకాళహస్తి, కాణిపాకం క్షేత్రాలకు వచ్చి వెళ్లే భక్తులు నలిగిపోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. కేంద్ర ప్రభుత్వానికి మద్దతునిచ్చిన కూటమి నేతలు దీనిపై చట్టసభల్లో లేవనెత్తకపోగా.. కనీసం సమస్యను కేంద్ర మంత్రుల దృష్టికి కూడా తీసుకెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది.

– సాక్షి ప్రతినిధి, తిరుపతి/అలిపిరి



జనరల్ బోగీలో టవళ్లపైనే ప్రయాణం

**చికుబుకు బండి.. నరకం చూడండి!**

- జనరల్ బోగీ ప్రయాణికులకు రోజూ కష్టాలే
- నిల్చోవడానిక్కూడా అవకాశం లేని ప్రయాణం
- బాత్ రూమ్‌ల వద్ద కొందరు.. లగేజీ క్యారియర్‌పై మరికొందరు
- జిల్లాలో ఆలయాలకు భారీగా తరలివస్తున్న భక్తులు
- జనరల్ బోగీలు పెంచాలంటున్న ప్రయాణికులు
- స్లీపర్, ఏసీ బోగీలు పెంచి.. జనరల్ బోగీలు పెంచకపోవడంపై ఆగ్రహం

## హౌరా..ఔరా?



వాష్ బేసిన్ వద్ద ప్రయాణికుల అవస్థలు



ప్రయాణికులతో కిక్కిరిసిన జనరల్ బోగీ

బెంగళూరు నుంచి కాట్పాడి, తిరుపతి, రేణిగుంట, ఒంగోలు, విజయవాడ, శ్రీకాకుళం, పలాస మీదుగా హౌరాకు చేరుకునే ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఇందులో జనరల్ బోగీలు రెండే ఉన్నాయి. ఈ రెండు బోగీల కెపాసిటీ 180 మంది. మంగళవారం ప్రయాణించిన వారు సుమారు వెయ్యి మంది ఉండొచ్చని అధికారుల అంచనా. అనేక మంది ఒంటి కాలుపై నిల్చొని ప్రయాణించడం కనిపించింది. కిక్కిరిసిన ప్రయాణికుల మధ్య చిన్నారులు గాలి ఆడక గుక్కపట్టి ఏడుస్తుంటే.. వారిని లాలించడానికి తల్లిదండ్రులు పడ్డ అవస్థలు వర్ణనాతీతం. ఇక వృద్ధుల పరిస్థితి ఆందోళనకరంగా కనిపించింది. బాత్‌రూంల వద్ద కూర్చొని ప్రయాణించిన వారి పరిస్థితి మరీ దుర్భరం. మొత్తంగా జనరల్ బోగీల్లో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది.

## రైల్వే సమాచారం

| | |
|---|---|
| రేణిగుంట, తిరుపతి మీదుగా రోజూ నడిచేరైళ్లు | 92 |
| ప్యాసింజర్ రైళ్లు | 36 |
| వారంలో ప్రత్యేకంగా నడిచే రైళ్లు | 40 |
| రోజూ తిరుపతికి చేరుకునే ప్రయాణికులు | 88 వేలు |
| హౌరా ఎక్స్‌ప్రెస్ రైల్లో ఉన్న జనరల్ బోగీలు | 2 |
| ఒక్కోబోగీలో | 90 మందికి పరిమితం |
| రిజర్వేషన్లు (స్లీపర్) | 80 మంది |
| ద్వితీయ ఏసీలో | 52 మంది |
| తృతీయ ఏసీలో | 72 మంది |

## భద్రత కరువు

జనరల్ బోగీల్లో ప్రయాణించే వారికి భద్ర కరువైంది. ఆ బోగీల్లో ప్రయాణిస్తున్న వారిలో ఎవరు మంచివారో, ఎవరు దొంగో, ఎవరు తీవ్రవాదో తెలియని పరిస్థితి. వస్తువులకైతే అస్సలు భద్రత ఉండదు. అనేక మంది ప్రయాణికుల ఫోన్లు, బ్యాగులు, నగదు, చోరీకి గురైన ఘటనలు కోకొల్లలు. జనరల్ బోగీల్లో ప్రయాణించే వారికి ప్రత్యేక భద్రత ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



హౌరా రైలులోని జనరల్ బోగీ వద్ద ప్రయాణికుల రద్దీ

## ఎంపీ చొరవతో అభివృద్ధి

తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి చొరవతో జైషల్‌మేర్ టూ రేణిగుంట, తిరుపతి–కొల్లాం ప్రత్యేక రైళ్లను నడిచేలా కృషి చేశారు. ఇవికాకుండా అదనంగా వందేభారత్ ట్రైన్, స్లీపర్ క్లాస్ ట్రైన్ తిరుపతి– విశాఖపట్నం మధ్య ఒకటి, తిరుపతి–వారణాసి, తిరుపతి–అయోధ్య, తిరుపతి–షిరిడీకి ప్రతి రోజూ రైళ్లను నడపాలని కోరారు. నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలుని నాయుడుపేట వద్ద ఆపాలని, హౌరా, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లను వెందోడు స్టేషన్‌లో ఆపాలని ఎంపీ కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే రూ.300 కోట్లతో తిరుపతి రైల్వేస్టేషన్ అభివృద్ధికి ఎంపీ గురుమూర్తి చేసిన కృషిని అధికారులు ప్రశంసిస్తున్నారు. సూళ్లూరుపేట మోడ్రన్, తిరుచానూరు రైల్వేస్టేషన్ పనులు పూర్తి కావచ్చాయి. రూ.500 కోట్లతో పూడి– ఏర్పేడు మధ్య రైల్వే లైన్‌కి నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. అదేవిధంగా రేణిగుంట, శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రణాళికలు పంపారు. ఇంకా రైల్వే అండర్ బ్రిడ్జి పనులు, ఫుట్ అవర్ బ్రిడ్జిలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఎప్పటి నుంచో ప్రతిపాదనలో ఉన్న బాలాజీ డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



జనరల్ బోగీలో కిక్కిరిసిన ప్రయాణికులు

### నిలబడి ప్రయాణించాల్సిందే



నాది హైదరాబాద్. స్నేహితులతో కలిసి తిరుమల రావడానికి సికింద్రాబాద్ నుంచి తిరుపతికి రిజర్వేషన్ చేయించాను. వెయింటింగ్ లిస్టు–19 వచ్చినా అదే చూపుతూ ఉండడంతో బస్సులో తిరుపతికి చేరుకున్నా. పలాస నుంచి వచ్చిన స్నేహితులతో కలుసుకుని తిరుమల వెళ్లాను. దర్శనం అయ్యాక హైదరాబాద్ కాకుండా స్నేహితులతో పలాసకు బయలుదేరాను. హౌరాలో నిలబడేందుకు స్థలం లేదు. బాత్రూమ్‌ల వద్ద నిలుచుకునే పరిస్థితి. రెండు స్టాపింగ్‌లలో చూసి స్థలం దొరక్కపోతే మళ్లీ దిగేసి బస్సుకే వెళ్తాం. – సాయిమణి, హైదరాబాద్

### రెండు జనరల్ బోగీలే



మాది కోల్‌కతా. ఉద్యోగ రీత్యా బెంగళూరులో స్థిరపడ్డాం. మా ఆయన బెంగళూరులోని ఓ పరిశ్రమలో పనిచేస్తారు. కుటుంబానికి ఆసరాగా నేను కూడా చిన్న ఉద్యోగం చేసుకుంటూ అక్కడే ఉండిపోయాం. మా కుటుంబం పెద్దలందరూ కోల్‌కతాలో ఉంటారు. వారి కోసం ఏడాదికి రెండు, మూడు సార్లు సెలవులు దొరికినప్పుడల్లా వెళ్లిపోతుంటాం. రిజర్వేషన్ చేస్తే వెంటనే కుదరదని.. జనరల్ బోగీలోనే ఎక్కేసి వెళ్లిపోతాం. కిక్కిరిసిన జనాలతో పిల్లలను తీసుకొని ప్రయాణం చేయడం చాలా ఇబ్బందికరంగా ఉంది. హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ అయినా జనరల్ బోగీలు రెండే ఉండడం దారుణం. – లక్ష్మి, కోల్‌కతా

### బోగీల సంఖ్య పెంచితేనే..



శ్రీకాకుళం నుంచి అమ్మనాన్నలు.. తమ్ముడితో కలిసి తిరుమలకు రైలులోనే రెండు రోజుల క్రితం వచ్చాం. సర్వదర్శనంలో స్వామివారిని దర్శించుకుని ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యాం. వచ్చేటప్పుడు ఎంత రద్దీగా ఉందో అదే రద్దీ తిరుగు ప్రయాణంలోనూ హౌరా ఎక్స్‌ప్రెస్‌లో ఉంది. జనరల్ బోగీ కావడంతో తిరుపతిలోనే నిల్చుకోవడానికి స్థలం లేదు. మంగళవారం ఉదయం 8 గంటల వరకు రైలు ప్రయాణంలో ఇబ్బందులు పడాలి. బాత్రూమ్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయి. – కల్యాణ్, శ్రీకాకుళం



కింద కూర్చొని అవస్థలు పడుతున్న ప్రయాణికులు

## న్యూస్‌రీల్

### నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్లు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** ఆస్తుల రిజిస్ట్రేషన్లు ప్రభుత్వ నిబంధనల మేరకు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలసి జిల్లాలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలా పడితే అలా రిజిస్ట్రేషన్లు చేస్తే వచ్చే అనర్థాలను వివరించారు. అలాంటి వారిపై చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. చిన్న భూమి అయినా పెద్ద ఆస్తులు అయినా రికార్డుల ప్రకారమే స్పష్టమైన ఆధారాలతోనే రిజిస్ట్రేషన్ చేయాలని పేర్కొన్నారు. ఒకటికి రెండుసార్లు నిశితంగా తనిఖీలు చేసిన తర్వాత రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టం చేశారు. మరోవైపు రికార్డులను ఓ క్రమపద్ధతిలో ఉంచుకోవాలని సూచించారు. తిరుపతితోపాటు జిల్లాలోని 16 ఉప రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ రికార్డులను క్రమపద్ధతిలో ఉంచుకోవాలని ఆదేశించారు. జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్లు కొండారెడ్డి, ఆనందన్, రూపారాణి, కమలాకర్ పాల్గొన్నారు.

# రేపటి నుంచి హెల్మెట్ తప్పనిసరి



ట్రాఫిక్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు



సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి
- ఫుట్‌పాత్ ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు
- ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు
- ఎస్పీ సుబ్బరాయుడు

**తిరుపతి క్రైమ్:** పోలీస్ సిబ్బంది ఆగస్టు 1వ తేదీ నుంచి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్ సిబ్బంది హెల్మెట్ ధరించి ప్రజలకు ఆదర్శవంతంగా నిలవాలన్నారు. హెల్మెట్ వాడకం మనదగ్గర నుంచే మొదలైతే ప్రజల్లో కూడా చైతన్యం వస్తుందన్నారు.

**ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే ఉపేక్షించం**

ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన తిరుపతిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. అడ్డగోలుగా పార్కింగ్, ఫుట్ పాత్ ఆక్రమణపై ఆయన సీరియస్ అయ్యారు. నగరంలోని పూర్ణకుంభం సర్కిల్, సెంట్రల్ పార్క్ సహా పలు సిగ్నల్ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలంతా నిర్దేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలన్నారు. రాంగ్ పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని చెప్పారు.

**డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే కోర్టుకే**

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారిని కోర్టులో హాజరు పరచాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు. ఇప్పుడు చాలా వరకు కూడా జరిమానాలతో పాటు శిక్షలు కూడా పడుతున్నాయని చెప్పారు.

**ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు**

ప్రజల సౌకర్యార్థం రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ చెప్పారు. ర్యాష్ డ్రైవింగ్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాంటి వారికి డ్రైవింగ్ లైసెన్సులు కూడా రద్దు చేసేలా ఆర్టీఓకు రెఫర్ చేస్తామని చెప్పారు.

# 23 మందిపై సస్పెన్షన్ వేటు

- చిల్లకూరులో టీడీపీ మార్క్ రాజకీయం
- వీధిన పడిన ఉపాధి హామీ క్షేత్రసహాయకులు

**చిల్లకూరు:** చిల్లకూరులో టీడీపీ మార్క్ రాజకీయం నడుస్తోంది. అధికారులపై ఒత్తిడి తెచ్చి ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న 23 మందిని సస్పెండ్ చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉన్నామన్న నెపంతో తమ పొట్టకొట్టడం ఎంతవరకు సమంజసమని పలువురు బాధితులు మండిపడుతున్నారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులను ఇటీవల తనిఖీలు చేపట్టారు. అనంతరం మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక బహిరంగ సభ ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన అవినీతి, అక్రమాలను అధికారులు చదివి వినిపించారు. ఆపై 16 మంది క్షేత్ర సహాయకులు, ఐదుగురు టెక్నికల్ అసిస్టెంట్లు, ఇద్దరు జేఈలను డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ సస్పెండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బందిని తొలగించే ప్రయత్నాలను టీడీపీ నాయకులు ముందు నుంచి ప్రయత్నిస్తుండగా.. వారికి సామాజిక తనిఖీ బహిరంగ సభ వరంలా మారింది. కేవలం కక్ష సాధింపులో భాగంగానే సస్పెండ్ చేసినట్టు బాధితులు ఆరోపించారు.

**జాబ్‌కార్డు ఇవ్వలేదనే సాకుతో..**

కేవలం జాబ్ కార్డు ఇవ్వలేదన్న సాకుతో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడకపోయినా.. వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్నారన్న కారణంతోనే తమను తొలగించారని బాధితులు పేర్కొన్నారు.

**వేదికపై టీడీపీ నాయకులు**

బహిరంగ సభా వేదికపై అధికారులతో పాటుగా ప్రజాప్రతినిధులు హాజరు కావడం సర్వసాధారణం. అయితే మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన సభావేదికపై టీడీపీ నాయకులు దర్జాగా కూర్చోవడం కనిపించింది. దీనిపై జిల్లా స్థాయి అధికారి కూడా వారిని కనీసం ఎవరు..? అని ప్రశ్నించకపోవడం గమనార్హం.



విచారణ చేస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్




**బంగారం :**
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.70.740
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6.319
**వెండి:**
హోల్‌సేల్ ధర (కిలో) రూ.84.000
రిటైల్ వెండి గ్రాము రూ.86.00

## క్లుప్తంగా

### ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్
– వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రహీంరెడ్డి

**సూళ్లూరుపేట రూరల్ :** ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ఘటనలో ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. ఈ ఘటన సూళ్లూరుపేట జాతీయ రహదారిపై పిండిపాళెం గ్రామం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. నెల్లూరు నుంచి సూళ్లూరుపేట మల్లిశెట్టి నరేంద్ర (35) వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు అన్నమయ్య జిల్లా, నగిరి పాడు గ్రామం, వెంకటరాజుపల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇక్కడ ఏ పనిపై వచ్చాడో ఇంకా పూర్తి వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ కే.రహీంరెడ్డి తెలిపారు.

# విష్ణు ఆలయాన్ని సందర్శించిన అధికారులు


చిట్టేడులో పురాతన కోనేరును పరిశీలిస్తున్న ప్రొఫెసర్ సురేంద్ర

**వాకాడు :** వాకాడు మండలం, తిరుమూరు గ్రామంలో చెట్ల పొదల్లో శిథిలావస్థలో బయటపడిన విష్ణు ఆలయాన్ని మంగళవారం పురావస్తుశాఖ అధికారులు పరిశీలించారు. పురావస్తుశాఖ ఏడీ శివకుమార్, చరిత్ర కారుడు స్థపతి, ప్రభుత్వ కళాశాల ప్రొఫెసర్స్ గోవిందుసురేంద్ర, వినోద్, దేవదాయశాఖ అధికారి శశాంక్ తదితరులు ఆలయాన్ని సందర్శించి, ఆలయ చరిత్రను అంచనా వేశారు. గోవిందుసురేంద్ర మాట్లాడుతూ స్థానికుల ఆహ్వానంతోపాటు మైసూర్ పురావస్తుశాఖ అధికారి మునిరత్నంరెడ్డి ఆదేశాలతో ఆలయాన్ని సందర్శించినట్టు తెలిపారు. ఈ ఆలయాన్ని చూస్తే చోళుల నాటి కట్టడాలుగా, మంచి చరిత్ర ఉన్న ఆలయంగా తెలుస్తోందన్నారు. ఒకప్పుడు తిరుమూరు వర్తక వాణిజ్య కేంద్రంగా ఉన్నట్లు చరిత్రద్వారా తెలుస్తోందని, అలాగే తీర ప్రాంతంలో చాలా ఆలయాలు శిథిలావస్థలో ఉన్నాయని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసి గత వైభవాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని సూచించారు.

**చరిత్రకు ఆనవాళ్లు.. పురాతన దేవాలయాలు**

**కోట:** గూడూరు డివిజన్‌లో పురాతన ఆలయాలు చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్నాయని పురావస్తుశాఖ ప్రొఫెసర్ సురేంద్ర తెలిపారు. మండలంలోని కొత్తపట్నం, చిట్టేడు, గూడలిలో శిథిలావస్థకు చేరిన ఆలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. తీర ప్రాంతంలోని కొత్తపట్నంలో రాజుల కాలం నాటి కట్టడాలు మనకు కనిపిస్తున్నాయని, ఇక్కడ విష్ణు దేవాలయంతో పాటు శివాలయాన్ని చోళరాజులు నిర్మించినట్లుగా శాసనాల ద్వారా తెలుస్తోందని చెప్పారు. పూర్తిగా శిథిలావస్థకు చేరిన కారణంగా వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. చిట్టేడులో పురాతన కోనేరుకు ఎంతో చరిత్ర ఉందన్నారు. అంతరించి పోతున్న అమ్మవారి కోనేరుకు సంబంధించి శాసనాలు ఉన్నట్లు గ్రామస్తులు తెలియజేశారన్నారు.


బాధితులకు చెక్కు పంపిణీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

# ఆపన్నహస్తం

- టీడీపీ దాడుల్లో గాయపడ్డ వారికి జగనన్న ఆర్థిక సాయం
- చెక్కులు పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి

**పాకాల:** టీడీపీ మూకల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలకు ఆ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. వారికి ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచారు. ఈ మేరకు మండలంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ నాయకుల దాడుల్లో గాయపడ్డారు. వారందరికీ స్థానిక మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళవారం చెక్కులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఇస్తున్నది ఆర్థిక సాయం కాదని, మనోధైర్యమని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సహనం పాటించాలని, అన్ని సమయాల్లో పార్టీ శ్రేణులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. టీడీపీ దాడుల్లో గాయపడ్డ, నష్టపోయిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేశారు. రమణయ్యగారిపల్లి, పాకాల టౌన్, ఊట్లవారిపల్లి గ్రామాలకు వెళ్లి బాధితులకు జగనన్న పంపిన చెక్కులను చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందజేశారు. జగనన్న పేరుతో వచ్చిన చెక్కులను గుర్తుగా దాచుకుంటామని బాధితులు తెలిపారు.

# నిబంధనలు తప్పనిసరి


ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

**పెళ్లకూరు:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల నిర్వహణలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నెలబల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడం వల్ల ఉపాధి పనులను అన్నీ ప్రాంతాల్లో కల్పించినట్టు పేర్కొన్నారు. పని ప్రదేశంలో కూలీలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు పూర్తి చేయించి ఎప్పటికప్పుడు మస్టర్లు సక్రమంగా నమోదు చేయించాలన్నారు. అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

### ఇంటి వద్దే పింఛన్లు

**తిరుపతి అర్బన్:** జూలై నెలకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి సచివాలయ ఉద్యోగులు ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో ఆయన జేసీ శుభం బన్సల్‌తో కలసి మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టాలన్నారు. తొలి రోజు 99 శాతం పూర్తి చేయాలని సూచించారు. డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, డిప్యూటీ సీఈఓ ఆదిశేషారెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి, ఎల్డీఎం విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

### రేపటి నుంచి సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు

**వెంకటగిరి రూరల్:** ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో సీనియర్ విభాగం సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఆగస్టు 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల్లో నెల్లూరు, కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నట్టు వెల్లడించారు.

### ప్రాజెక్టుల్లో పురోగతి చూపండి

**తిరుపతి అర్బన్:** ప్రాజెక్టు పనుల్లో పురోగతి చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన అంశాలను వివరించారు. జిల్లాలో తెలుగుగంగతో పాటు గాలేరు–నగరి, సుజల స్రవంతి, బాలాజీ రిజర్వాయర్, మల్లెమడుగు రిజర్వాయర్ పనుల్లో పురోగతి చూపించాలన్నారు. తాగు, సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ అధికారులు రాధాకృష్ణమూర్తి, శివారెడ్డి, మదనగోపాల్, సుబ్రమణ్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఆవుల చోరీపై ఫిర్యాదు

**బాలాయపల్లి(సైదాపురం):** బాలాయపల్లి మండలంలోని వెంగమాంబపురం, మాచవరం, పచ్చారుచేను గ్రామాలకు చెందిన కొందరు ఆవులను అపహరిస్తున్నారని బాధితులు దామా గురుమూర్తి, ఉప్పు శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వారు ఆవుల చోరీపై బాలాయపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం తమ నివాసంలో కట్టేసి ఉంచిన ఆవులు కనిపించకుండా పోయాయని వాపోయారు. సమీప గ్రామాల్లో ఆవుల కోసం గాలించినా కనిపించలేదన్నారు. 10 ఆవుల ఆచూకీ లేదని, అదృశ్యమైనట్లు బాధితులు వాపోతున్నారు.

### ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోండి

**తిరుపతి అర్బన్:** ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడానికి జిల్లాలో రెండు పింక్ బస్సులను ఏర్పాటు చేశామని.. రోగులను గుర్తించి తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ఎంఎల్‌హెచ్‌పీలకు ఒక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పింక్ బస్సు షెడ్యూల్ ప్రకారం స్థానికులను క్యాంపులకు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాల్సి ఉందని బయో నిర్వాహకుడు డాక్టర్ ఎం.జయచంద్రారెడ్డికి వివరించారు. తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీబాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ(బయో) ద్వారా జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలో పింక్ క్యాంపులు ఉంటాయన్నారు. తొలి దశలోనే క్యాన్సర్‌ను గుర్తించడం ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తోందన్నారు. స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.నాగరాజ్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.లలిత్ పాల్గొన్నారు.

### రేపటి నుంచి ఎంబీఏ పరీక్షలు

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ పరిధిలోని అన్ని పీజీ కళాశాలల్లో ఆగస్టు 1వ తేదీ గురువారం నుంచి ఎంబీఏ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాల ముందే అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు.



### ఆగస్టు నెలాఖరులో వాలీబాల్ పోటీలు

**చిల్లకూరు:** తీర ప్రాంతంలోని జిందాల్ పవర్ లిమిటడ్, జేఎస్‌పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 30, 31 తేదీలలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్టు జిందాల్ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. తీర ప్రాంతంలోని తమ్మినపట్నంలో ఉన్న పవర్ ప్రాజెక్టులో వారు మాట్లాడుతూ మండలంలోని మోమిడి గ్రామంలో ఉన్న క్రీడా మైదానంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో చిల్లకూరు మండలం వారికి మాత్రమే అవకాశం ఉందని, అది కూడా ప్రతి గ్రామం నుంచి రెండు జట్లు మాత్రమే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. క్రీడాకారులు తమ ఆధార్‌తో పాటు పంచాయతీ సిఫార్సు లేఖ తీసుకొచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. చాంపియన్ షిప్‌కు ట్రోఫీ, రూ.20 వేలు మొదటి బహుమతిగా ఇవ్వనున్నట్టు వెల్లడించారు. అలాగే మొదటి రన్నరప్‌నకు రూ.15 వేలు, రెండో రన్నరప్‌నకు రూ.10 వేలు, మూడో రన్నరప్‌నకు రూ.5 వేలు నగదు బహుమతులు ఉంటాయన్నారు.

### ఆర్యవైశ్య సంఘ జిల్లా రూరల్ అధ్యక్షుడిగా కిషోర్


గూడూరు కిషోర్‌కుమార్


**నాయుడుపేట టౌన్:** ఆర్యవైశ్య సంఘ తిరుపతి జిల్లా రూరల్ అధ్యక్షులు నాయుడుపేట పట్టణానికి చెందిన గూడూరు కిషోర్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టీజీ.వెంకటేష్ సారధ్యంలో తిరుపతి జిల్లా రూరల్ కమిటీని ఎంపిక చేసినట్టు ఆ సంఘ నాయకులు వెల్లడించారు. త్వరలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేస్తుందని అందులో పేర్కొన్నారు.

# సిమెంట్ లారీ బోల్తా


బోల్తా పడిన సిమెంట్ లారీ

**రాపూరు:** సిమెంట్ లారీ బోల్తా పడిన ఘటన రాపూరు మండలం, పెంచలకోన తెగచర్ల మార్గంలోని మలుపు వద్ద మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ మాల్యాద్రి కథనం.. వైఎస్సార్ జిల్లా కడప నుంచి తిరుపతి జిల్లా, నాయుడుపేటకు సిమెంట్ లోడ్డుతో వెళ్తున్న లారీ పెంచలకోన సమీపంలోని మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్ నాగేంద్ర సిమెంట్ బస్తాల మధ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్ నాగేంద్రను అతికష్టం మీద బయటకు తీసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### పాము కాటుకు గిరిజన బాలిక మృతి


మృతి చెందిన బాలిక లతని

**రాపూరు:** పాము కాటుకు గిరిజన బాలిక మృతిచెందిన ఘటన రాపూరు సమీపంలోని, వెంకటేశ్వరపురం, గిరిజ కాలనీలో సోమవారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. కాలనీకి చెందిన భూపతి రఘురామయ్య, జయమ్మ మనవరాలు లతని(12) ఇంట్లో నిద్రిస్తుండగా పాముకాటు వేసింది. వెంటనే పాపను రాపూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. లతనికి తండ్రి వెంకటేశ్వర్లు గతంలోనే మృతి చెందడంతో తల్లి ధనమ్మతో కలసి ఉంటోంది. విషయం తెలుసుకున్న పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆపై కుటుంబ సభ్యులకు అందజేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

### కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన కొండయ్య

**గూడూరు రూరల్:** కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గూడూరు రూరల్ మండలం, చెంబడిపాళెంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. చెంబడిపాళెంకు చెందిన కర్లగుంట కొండయ్య(38) అనే వ్యక్తి మద్యానికి బానిసై కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్త స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

# తాగునీటికి కాల్‌సెంటర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

- 9441725450కు సమాచారం ఇవ్వాలని సూచన

**తిరుపతి అర్బన్:** తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, అంటువ్యాధులు తదితర సమస్యలపై 9441725450 నంబర్‌కు తెలియజేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. మంగళవారం ఆయన కాల్ సెంటర్ నంబర్‌కి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న కాల్‌సెంటర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిదినాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే ఫోన్ ద్వారా లేదా వాటాప్స్ ద్వారా తెలియజేయాలని చెప్పారు. ఆయన వెంట డీపీవో సుశీలాదేవి, డివిజనల్ పంచాయతీ అధికారి రుపారాణి పాల్గొన్నారు.

# ఏకలవ్య గురుకులం తనిఖీ


వంట గదిలోని కూరగాయలను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రముని

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడ్రన్ గురుకుల పాఠశాల హాస్టల్‌ను సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'గురుకులం..సమస్యలతో సతమతం' వార్త వెలుడింది. దీనిపై స్పందించిన ఆర్డీఓ హాస్టల్ పరిసరాలను పరిశీలించి, వసతుల గురించి ఆరా తీశారు. అలాగే రోజువారీ అందుతున్న ఆహార నాణ్యత మెనూను తెలుసుకున్నారు. శుభ్రత విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని హాస్టల్ వార్డన్, ప్రిన్సిపల్‌కు సూచించారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పనిచేయని తాగునీటి ఆర్వో సిస్టమ్, అన్నం వండే స్టీమ్, చపాతీలు తయారు చేసే యంత్రాలను రిపేరు చేయించుకోవాలన్నారు. విద్యార్థులకు రోజువారీ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్నాక్స్ , కోడిగుడ్లు, చికెన్ సక్రమంగా పెట్టాలన్నారు. స్నానాన్నికి నీళ్లు, తాగునీటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఒకో గదిలో నలుగురు మాత్రమే ఉండేలా చూడాలన్నారు. మెస్‌లోని ఫ్యాన్లకు మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,874 మంది స్వామివారిని దర్శించుకోగా 23,782 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.48 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### 2న ఎస్వీయూలో జాబ్‌మేళా

**తిరుపతి సిటీ:** శ్రీ వేంకటేశ్వర ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఆగస్టు 2వ తేదీ శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా, బెంగళూరుకు సంబంధించిన నాలుగు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరవుతారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ, బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన, ఆసక్తిగల అభ్యర్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తనిఖీలు


రేణిగుంట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న డీఆర్‌ఎం విజయకుమార్

**రేణిగుంట:** గుంతకల్ డీఆర్‌ఎం ఎం.విజయకుమార్ మంగళవారం రేణిగుంట రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఆయన స్టేషన్‌లో ప్రయాణికులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ప్రయాణికుల వెయిటింగ్ హాళ్లను తనిఖీ చేసి, వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆయనకు రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హసన్ సాహెబ్ ఆధ్వర్యంలో రైల్వే పెన్షనర్లు తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జయశంకర్ చౌహాన్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

### 74 ఏళ్ల వృద్ధుడిపై పోక్సో కేసు

**చిల్లకూరు:** 74 ఏళ్ల వృద్ధుడిపై పోక్సో కేసుతోపాటు అట్రాసిటీ కేసు కూడా నమోదైనట్టు పోలీసులు తెలిపారు. వారి కథనం.. ఎగువరాజుపాళెం గ్రామానికి చెందిన ఏలూరు వెంకటయ్య (74) సమీపంలోని ఓ గ్రామానికి చెందిన చిన్నారి బడికి వెళ్లి ఇంటికి వస్తుండగా.. అదే సమయంలో ఆ చిన్నారికి తినుబండారాలు ఇచ్చి మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అయితే విషయం తెలియని చిన్నారి రెండు రోజుల తరువాత తల్లికి చెప్పడంతో ఆమె భర్తకు చేరవేసింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసిన పోలీసులు వృద్ధుడిపై పోక్సో కేసుతో పాటు అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు చేస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

**తిరుపతి అర్బన్:** మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలో కాంట్రాక్టర్ ఉద్యోగాలకు కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ నేతృత్వంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మూడు నెలల కిందట కేంద్రప్రభుత్వం ప్రకటించిన మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా సోషల్ వర్కర్, నర్సు, ఆయా, చౌకీదార్ క్యాడర్‌కు చెందిన 9 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఆ మేరకు ఐసీడీఎస్‌కు 23 మందిని ఇంటర్వ్యూలు చేశారు. వారిలో ఎంపికైన 9 మందికి త్వరలో నియామక పత్రాలను అందజేయనున్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, జిల్లా సామాజిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, బాలల సంరక్షణ సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు మంజుల, జిల్లా బాలల సంరక్షణ అధికారి శివశంకర్ పాల్గొన్నారు.